క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పులివెందుల రూరల్ : పట్టణంలోని 33/11కె.వి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ జగదీశ్వరరెడ్డి తెలిపారు. పట్టణంలోని 11కె.వి కడప రోడ్డు ఫీడర్ కింద ట్రాన్స్‌ఫార్మర్ ఎరెక్షన్, లైన్ షిఫ్టింగ్ కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కమలాపురం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం ఎంపీపీ గండి భారతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్ని పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు హాజరు కావాలన్నారు. అలాగే అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పూర్తి స్థాయి ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని తెలిపారు.

విత్తనాలకు రిజిస్ట్రేషన్లు చేసుకోండి

వేముల : వ్యవసాయ బోర్లు, బావుల కింద వేసవిలో వేరుశనగ, మినుము పంటలను సాగు చేసే రైతులు ఆయా రైతు సేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని ఏఓ చెన్నారెడ్డి తెలిపారు. ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో వేరుశనగ, మినుము విత్తనాలను అందిస్తోందని, 30 కేజీల వేరుశనగ బస్తా రూ.2,880లు కాగా, అందులో రూ.1440లు సబ్సిడీ పోనూ, రైతుకు ఒక బస్తాకు రూ.1440లు కట్టాల్సి ఉంటుందన్నారు. ప్రతి రైతుకు గరిష్టంగా మూడు బస్తాల వరకు వేరుశనగ ప్యాకెట్లను ఇస్తామన్నారు. అలాగే మినుములు కేజీ రూ.140 కాగా, సబ్సిడీపోనూ రైతు కేజీ మినుములకు రూ.70 లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మినుములు నాలుగు కేజీల ప్యాకెట్ సబ్సిడీ పోనూ రూ.280లు రైతులు చెల్లించాలన్నారు. వేరుశనగ, మినుము పంటలు సాగు చేసే రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీని ప్రారంభిస్తున్న సీఐ

కమలాపురం : జన సంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సీఐ ఎస్‌కే రోషన్ తెలిపారు. బుధవారం స్థానిక క్రాస్ రోడ్డులో మన ఊరు సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మజ్జిగ పంపిణీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వేసవి కాలంలో చలివేంద్రాలు పాదాచారులకు, ప్రయాణికులకు, వాహన చోదకులకు వరం లాంటివన్నారు. చలివేంద్రం ఏర్పాటు చేసిన మన ఊరు సేవాసమితి అధ్యక్షుడు శీలం శ్రీనువాసులు మజ్జిగ కూడా ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పదవీ విరమణ



రామకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న సిబ్బంది

వీరపునాయునిపల్లె : మండలంలోని సంగమేశ్వర ఎయిడెడ్ పాఠశాలలో జూనియర్ అసిస్టెంటుగా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణారెడ్డి సేవలు మరువలేనివని మండల విద్యాశాఖాధికారి జాఫర్ సాదిక్ అన్నారు. బుధవారం స్థానిక వీఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో పదవీ విరమణ సభ ఏర్పాటు చేశారు. అనంతరం రామకృష్ణారెడ్డిని సంగమేశ్వర విద్యా సంస్థల అధినేత వెంకటసుబ్బానాయుడు, పాఠశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు.

తిరునాలను జయప్రదం చేయండి

కమలాపురం : మండలంలోని పెద్దచెప్పలిలో వెలసిన శ్రీ ఎల్లమ్మ (హేలాంబ) తిరునాల మహోత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ తోట రవీంద్ర పిలుపునిచ్చారు. బుధవారం ఆలయంలో తిరునాల మహోత్సవాల పోస్టర్లను ఆయన కమిటీ సభ్యులతో కలసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 23వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఈ మహోత్సవాలకు జిల్లా నుంచే కాక ఇతర జిల్లాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

పనికి తగ్గ వేతనం ఇవ్వాలి

జమ్మలమడుగు : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం చేయడం జరుగుతోందని కార్మికులకు పనికి తగ్గ వేతనం రూ. 26వేలు ఇవ్వాలని సీఐటీయూ, అనుబంధ సంస్థల ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో మున్సిపల్ ఫెడరేషన్ యూనియన్ 3వ పట్టణ మహాసభలను అధ్యక్షుడు నాగన్న అధ్యక్షతన నిర్వహించారు.

టెన్త్‌లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ

పులివెందుల టౌన్ : పదవ తరగతి పరీక్షా ఫలితాలలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 97 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 76 మంది ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్ఎం చిన్నగంగిరెడ్డి తెలిపారు. ఎ.బిందులత 579 మార్కులు, ఎం.అలేఖ 578, ఎల్.సంధ్యారాణి 569 మార్కులు సాధించారని ఆయన తెలిపారు. రమణప్ప సత్రంబడి పాఠశాలలో 97 మందికి 61 మంది పాసయ్యారు, నాగచైతన్య 571, స్వర్ణలత 550 లు మార్కులు సాధించారు. అహోబిలాపురం మెయిన్ ఉన్నత పాఠశాలలో 129 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 75 మంది ఉత్తీర్ణత సాధించారు. గౌరిశంకర్ 575, జాఫర్ 535 మార్కులు సాధించారు. అంకాలమ్మపేట ఉన్నత పాఠశాలలో 37 మందికి 12 మంది ఉత్తీర్ణత సాధించగా, శ్రావణి 568, భవిత 441 సాధించారు. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లె ఉన్నత పాఠశాలలో 36 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 27 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో కె.చంద్రిక 567 మార్కులు సాధించి పాఠశాల ఫస్ట్‌గా నిలిచారు. ఎర్రగుడిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో 27 మందికి 17 మంది పాసయ్యారన్నారు. ఇస్లాంపురం ఉర్దూ ఉన్నత పాఠశాలలో 12 మందికి 11మంది ఉత్తీర్ణత సాధించారు. బెస్తవారిపల్లెలోని అంబేద్కర్ గురుకుల బాలుర పాఠశాలలో 55 మందికి 27మంది ఉత్తీర్ణత సాధించగా, 22 మంది ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యారని ఎంఈఓ రామానాయుడు తెలిపారు. నల్లపురెడ్డిపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎ.లోహిత 580 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచారు.

కమలాపురంలో..



ఎస్.మహబూబ



ఎన్. మహిత

కమలాపురం : పట్టణంలోని జెడ్పీ గర్ల్స్ హైస్కూల్‌కు చెందిన ఎస్.మహబూబ 563 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. నల్లింగాయపల్లె జెడ్పీ హైస్కూల్‌కు చెందిన, ఎన్.మహిత 560 మార్కులతో ద్వితీయ స్థానంలో, అదే పాఠశాలకు చెందిన ఏజీ.లక్ష్మీచైత్రరెడ్డి 558 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలకు చెందిన ఎం.ప్రీతి 552 మార్కులతో తర్వాత స్థానంలో నిలిచింది. మండలంలో ప్రభుత్వ పాఠశాలకు చెందిన 419 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 277 మంది ఉత్తీర్ణులయ్యారు. 142 మంది ఫె యిలయ్యారు. దీంతో 66.11 శాతం ఉత్తీర్ణత నమోదైంది. కాగా ప్రైవేట్ పాఠశాలకు చెందిన 96 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 61 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

తొండూరులో..

తొండూరు : స్థానిక ఉన్నత పాఠశాల వరుసగా మూడవ సారి మండల్ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది 57 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 50 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాలలో 576 మార్కులతో అట్ల భవిత మండల స్థాయిలో ప్రథమ స్థాయిలో నిలిచింది. 568 మార్కులతో జస్వంత్, 564 మార్కులతో వేదవికాస్, 545 మార్కులతో మునిచేతన్, హరికేశవ తర్వాతి స్థానాలలో నిలిచారు. ఇనగలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన యాడికి నాగహేమ 572 మార్కులు సాధించి మండలంలో ద్వితీయస్థానంలో నిలిచింది. అగడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 27 మందికి 19 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇనగలూరు ఉన్నత పాఠశాలలో 23మందికి గానూ 22మంది ఉత్తీర్ణత సాధించారు. మల్లేల ఉన్నత పాఠశాలలో 12 మందికి 8 మంది ఉత్తీర్ణత సాధించారు. సంతకొవ్వూరు ఉన్నత పాఠశాలలో 18 మందికి 10 మంది ఉత్తీర్ణత సాధించారు.

లింగాలలో..



అరుణ్ కుమార్



సుందరేశ్వర్

లింగాల : మండల వ్యాప్తంగా ఇప్పట్ల ప్రతిభ పాఠశాలతో పాటు మొత్తం ఏడు హైస్కూళ్లలో 288 మంది విద్యార్థులు పరీక్షలకు రాయగా 237 మంది పాసై, 82% ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ రామకృష్ణయ్య తెలిపారు. వెలిదండ్ల హైస్కూల్‌కు చెందిన అరుణ్‌కుమార్ 585 మార్కులు సాధించి మండలస్థాయిలో ప్రథమస్థానంలో నిలవగా, పెద్దకుడాల హైస్కూల్‌కు చెందిన సుందరేశ్వర్ 579 మార్కులతో ద్వితీయస్థానం, పార్నపల్లె హైస్కూల్‌కు చెందిన సిరి 575 మార్కులతో తృతీయ స్థానం సాధించి మండల టాపర్స్‌గా నిలిచారు.

వేంపల్లెలో..

వేంపల్లె : మండలంలోని రామిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి జస్వంత్‌రెడ్డి 592 మార్కులు సాధించి నట్లు ఎంఈఓ -2 స్టాలిన్ ఐజాక్ తెలిపారు. అలాగే 500కు పైగా మార్కులు 15 మంది విద్యార్థులు సాధించినట్లు హెడ్మాస్టర్ నాగాంజనేయులు తెలిపారు. వేంపల్లె జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జగదీష్ 580 మార్కులు సాధించగా, ధారా శ్రావణ్ కుమార్ 562, అనంత విష్ణువర్దన్ 553 మార్కులు సాధించారని హెడ్మాస్టర్ శివమునమ్మ తెలిపారు. అలాగే జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్.నస్రిన్ 569 మార్కులు సాధించి నట్లు హెడ్మాస్టర్ చెరుకూరు శ్రీనివాసులు తెలిపారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని గంగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాశాఖాధికారి జాఫర్ సాదిక్ తెలిపారు. ఉరుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 94 శాతం, పాలగిరి, పాయసంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 89 శాతం, సంగమేశ్వర ఎయిడెడ్ పాఠశాల విద్యార్థులు 83 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. సంగమేశ్వర పాఠశాల విదార్థిని రేష్మా 566 మార్కులతో మండలంలో మొదటి స్థానం, పాయసంపల్లె పాఠశాలకు చెందిన నిమ్మకాయల కీర్తన 556 మార్కులు ద్వితీయ స్థానం, 548 మార్కులతో తృతీయ స్థానం సాధించినట్లు ఆయన తెలిపారు.

చక్రాయపేటలో..

చక్రాయపేట : సురభి గ్రామం నాగలగుట్టపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఏ.శివశ్రీ 580 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. ఇదే పాఠశాలకు చెందిన పి.లోహిత 578, బి.జస్వంత్ 577లు మండల ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉత్తీర్ణు లయ్యారు. మండలంలో ఉన్న చక్రాయపేట 64.7 శాతం, చిలేకాంపల్లె 60 శాతం, మహదేవపల్లె 75 శాతం, సురభి జెడ్పీ హైస్కూల్ 76.3 శాతం, చక్రాయపేట కస్తూర్బా గాంధీ బాలికల 64.5 శాతం, గండి గురుకుల పాఠశాల 73.68 శాతం విద్యార్థులు ఉత్తీర్ణు లయ్యారు.

పెద్దముడియంలో..

పెద్దముడియం : మండలంలో మొత్తం 254 మంది విద్యార్థులకు 197 మంది ఉత్తీర్ణత సాధించారు. పెద్దముడియం పాఠశాలలో 22 మందికి 14 మంది, జంగాలపల్లె పాఠశాలలో 21 మందికి 15 మంది, భీమగుండం పాఠశాలలో 8 మందికి 6 మంది, గుండ్లకుంటలో పాఠశాలలో 20 మందికి 9 మంది, ఎస్.కొట్టాలపల్లె పాఠశాలలో 19 మందికి 12 మంది, పెద్దపసుపుల పాఠశాలలో 47 మందికి 33 మంది, పెద్దపసుపుల కస్తూర్బాలో 38 మందికి 33 మంది, గుండ్లకుంట గురుకుల పాఠశాలలో 79 మందికి 73 మంది ఉత్తీర్ణత సాధించారు. పెద్దపసుపుల ఉన్నత పాఠశాల విద్యార్థి అజిత్‌కుమార్ 572 మార్కులు, గురుకుల పాఠశాల విద్యార్థి సౌభాగ్య 570 మార్కులు, కస్తూర్బా పాఠశాల విద్యార్థి సుప్రియ 563 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ సాధించారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : రావులకొలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పల్లేటి జోషిక 595 సాధించి ప్రభుత్వ పాఠశాలల పరంగా జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలోనూ, రాష్ట్రస్థాయిలో మూడవ స్థానంలో నిలిచిందని పాఠశాల హెడ్మాస్టర్ ఓ.అంకన్న తెలిపారు. జోషిక సుంకేసుల గ్రామానికి చెందిన విద్యార్థి కాగా, పల్లేటి హరినాథరెడ్డి, పల్లేటి హేమలతల కుమార్తె జోషిక. విద్యార్థిని జోషిక తల్లిదండ్రులు వ్యవసాయంపైన ఆధారపడి జీవిస్తున్నారు.

కొండాపురంలో..



వై.క్షేమేంద్రనాథ్‌రెడ్డి



జి.భవ్య

కొండాపురం : దత్తాపురం జెడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థి వై. క్షేమేంద్రనాథ్‌రెడ్డి 574 మార్కులతో ప్రథమ స్థానం సాధించగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత 93 శాతం వచ్చినట్లు ఆయన తెలిపారు. టి.కోడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి కె.వరుణ్ 573 మార్కులు సాధించారు. లావనూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని జి.భవ్య 567 మార్కులు సాధించింది.

వేములలో..



కార్తీక్



మేఘన

వేముల : వేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జడ కార్తీక్ 590 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచారు. అలాగే మేఘన 575 మార్కులతో రెండవ స్థానంలో నిలిచింది. పాఠశాలలో 14 మంది విద్యార్థులు 500 మార్కులకుపైగా సాధించారు. అలాగే కస్తూర్బా పాఠశాలలో సాత్విక 562 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచింది.

మైలవరంలో..



వి.సుమంత



గాయత్రి



దీక్షిత

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : మైలవరం మండలస్థాయిలో 452 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 362 మంది ఉత్తీర్ణత సాధించారు. మండల స్థాయిలో వి.సమంత జెడ్పీ హైస్కూల్ వేపరాల పాఠశాలకు చెందిన విద్యార్థిని 588 మార్కులు, ఏపీ రెసిడెన్షియల్ మైలవరం పాఠశాలకు చెందిన బి.గాయత్రిలు 588 మార్కులు, వి.దీక్షిత 587 మార్కులు, దొమ్మర నంద్యాల పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు 585 మార్కులు సాధించారు. వారిలో వై.గౌస్ ఏజ్దానీ, సి.వెంకట కాశీ విశ్వనాథ్, బి.సుచరిత భాయిలు ఉన్నారు.

ముద్దనూరులో..



వైష్ణవి

ముద్దనూరు : స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని కె.వైష్ణవి 586 మార్కులు సాధించి మండలంలో టాపర్ నిలచింది. కె. సుజిత 574 మార్కులు, గురు కీర్తణ 559 మార్కులు సాధించి నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. మండలంలో 89.44 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : మండలంలో425 మంది 329 మంది విద్యార్థులు పాసై 77 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ సుజాత తెలిపారు. గంగనపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి నాగ వీరతరుణ్ 593 మార్కులతో మండల టాపర్‌గా నిలిచాడు. రెండవ స్థానంలో వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని నవ్యతేజ 586 మార్కులు సాధించగా మూడవ స్థానం గంగనపల్లె జిల్లాపరిషత్ హైస్కూల్ విద్యార్థిని సయ్యద్ హాజీర మార్కులు సాధించారన్నారు. వెల్లటూరు విష్ణు విద్యామందిర్ హైస్కూల్ విద్యార్థిని దివ్వరెడ్డి 586 మార్కులు సాధించింది.

వల్లూరులో..



డీ హర్షిత



పీ నందిని

వల్లూరు : మండలం మొత్తం 310 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 228 మంది ఉత్తీర్ణులై 73.55 శాతం ఉత్తీర్ణత సాధించారు. గంగాయపల్లెలో వున్న ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన 89 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 79 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 26 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారు. పాఠశాలకు చెందిన డీ హర్షిత 579 మార్కులు సాధించింది. పీ నందిని 576 మార్కులు, వై సుస్మిత 568 మార్కులు సాధించారు. వల్లూరు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంకు చెందిన 40 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 30 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో ఎస్ మణివీణ 553 మార్కులు, కే మణిస్విని 542 మార్కులు, జే జాహ్నవి 536 మార్కులు సాధించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 43 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 21 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో ఎస్.అర్షియా 520 మార్కులు, ఎమ్ హేమంత్ కుమార్ 486 మార్కులు సాధించారు. పెద్దపుత్త జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 11 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ముగ్గురు విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. గంగాయపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 39 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 14 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో పీ మహమ్మద్ గౌస్ 510 మార్కులు, కే అఖిల్ 502 మార్కులు సాధించారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో మండలం మొత్తానికి ఉత్తీర్ణత 67.5 శాతానికి పరిమితం అయింది. ప్రభుత్వ పాఠశాలలలో మొత్తం 243 మంది పరీక్షలు వ్రాయగా 164 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. మండల విద్యాశాఖ అధికారులు సుజాత, రమాదేవి మాట్లాడుతూ మండలంలో మొత్తం విద్యార్థులు 1363 మంది హాజరు కాగా 1258 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. అంగడివీధి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బి.భాను ప్రకాష్ 571 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల్లో టాపర్గా నిలిచాడని తెలిపారు.

ఎంపీడీఓ కార్యాలయం ప్రారంభం



ఎంపీడీఓ కార్యాలయాన్ని పునఃప్రారంభిస్తున్న మండల ఉపాధ్యక్షురాలు సావిత్రమ్మ, తదితరులు

తొండూరు : మండల ప్రజా పరిషత్ కార్యాలయం (ఎండీపీఓ)ను మండల ఉపాధ్యక్షురాలు సావిత్రమ్మ బుధవారం ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నిధులలో భాగంగా దాదాపు రూ.30 లక్షల వ్యయంతో కాంట్రాక్టర్ దశరథరామిరెడ్డి ఎంపీడీఓ కార్యాలయాన్ని పునఃనిర్మించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గతంలో కార్యాలయంలో సరైన వసతులు లేక అధికారులు, కార్యాలయానికి వచ్చిన ప్రజాప్రతినిధులు ఇబ్బందులు పడేవారని, ఎంపీడీఓ కార్యాలయాన్ని పునఃప్రారంభించడంవల్ల వసతులన్నీ బాగుండటంతో అధికారులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం జరిగిన మండల సర్వసభ్య సమావేశం ఉపాధ్యక్షురాలు అధ్యక్షతన జరిగింది. వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని గ్రామాల్లో అధికారులు ముందుగానే సమస్యను గుర్తించి పరిష్కరించాలని కోరారు. అలాగే ప్రజలకు అధికారులు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు ఓబులేసు, మహేశ్వరి, కో ఆప్షన్ మెంబర్ ప్రకాష్‌రావు, ఎంపీడీఓ విష్ణుప్రసాద్, ఏఓ మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

రేపు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చికిత్స అందిస్తారన్నారు. చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరి చేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించాలి



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న నరసింహారెడ్డి

వీరపునాయునిపల్లె : మండలంలోని ప్రతి రైతు సోదరుడు ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించాలని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ప్రజా భాగస్వామ్యం, ప్రకృతి-వ్యవసాయ అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. పీఎండీఎస్-నవదాన్యాల సాగుతో 365 పంటలు సాగు చేయాలని ఆయన రైతులకు సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతు సేవా కేంద్రాల వ్యవసాయ సహాయకులు, మహిళా రైతులు, వెలుగు కార్యాలయ సిబ్బంది, గ్రామ సమాఖ్య ప్రతినిదులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు



రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్ఐ

తొండూరు : శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పులివెందుల రూరల్ సీఐ వెంకటరమణ హెచ్చరించారు. పులివెందుల డీఎస్పీ మురళినాయక్ ఆదేశాల మేరకు శాంతి భద్రతల పరిరక్షణ, నేరరహిత సమాజంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో మండల పరిధిలోని ఇనగలూరు గ్రామంలో బుధవారం రూరల్ సీఐ ఆధ్వర్యంలో పోలీసులు నాకా బందీ నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ మాట్లాడుతూ సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని సూచించారు. నిరంతరం రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంటుందని, నేర ప్రవృత్తిని విడనాడకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ గణ మద్దిలేటి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టైల్స్ షాప్‌లో అగ్ని ప్రమాదం

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని సంజామల మోటులో ఉన్న టైల్స్ షాప్‌లో బుధవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. సిద్దార్ధ టైల్స్‌షాప్‌లో బుధవారం రాత్రి యజమాని గురుకుమార్ దేవుడి చిత్రపటాలకు దీపారాధన నిర్వహించాడు. అనంతరం షాప్ మూసివేసి ఇంటికి వెళ్లాడు. షాప్‌లో నుంచి పొగ వస్తుండటం గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు, యజమానికి ఫోన్‌చేసి సమాచారం అందజేశారు. అగ్నిమాపక శాఖ వాహనం వచ్చి మంటలను అదుపులోకి తెచ్చింది.

ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

వల్లూరు : కడప-తాడిపత్రి ప్రధాన రహదారి సత్యా గ్రీన్ సిటీ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. కడప వైపు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం, వల్లూరు వైపు నుంచి వస్తున్న మరో ద్విచక్ర వాహనం సత్యా గ్రీన్ సిటీ సమీపంలో ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు ద్విచక్ర వాహనాల్లో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. చికిత్స కోసం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ఎర్రగుంట్ల(జమ్మలమడుగు) : ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉంటారని పిల్లల స్థాయికి తగ్గట్టుగా బోధన ఉంటుందని అందువల్ల ఒత్తిడి లేని నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాశాఖ అధికారి శివప్రసాద్ తెలిపారు. బుధవారం పట్టణంలోని దొండపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ఐదవ తరగతి పూర్తి చేసుకున్న 20 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉగ్ర దాడిని ఖండిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ



దుగ్గాయపల్లెలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

వల్లూరు : జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడిని ఖండిస్తూ, అందులో మృతి చెందిన వారికి నివాళులు అర్పిస్తూ మండల పరిధిలోని దుగ్గాయపల్లెలో బుధవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. గ్రామానికి చెందిన యువకులు స్థానిక గ్రామ సచివాయం వద్ద నుండి నినాదాలు చేస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



పెద్దచెప్పలిలో ప్రజలకు దొంగ తనాల పట్ల అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్ఐ

కమలాపురం : దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్, ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. బుధవారం జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు, డీఎస్పీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో పెద్దచెప్పలి తదితర గ్రామాలలో ప్రజలకు దొంగతనాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో జిల్లాలో తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలు జరిగాయన్నారు. ముఖ్యంగా వేసవి కాలం కావడంతో చాలా మంది బయట నిద్రిస్తుంటారని, ఆ సమయంలో దొంగతనాలు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రజలు విలువైన ఆభరణాలు, నగదు ఇళ్లల్లో ఉంచుకోకుండా బ్యాంకు లాకర్లలో భద్ర పరచుకోవాలని సూచించారు. పొలం పనులకు, వాకింగ్‌కు, పశువులు మేపుకోవడానికి వెళ్లే మహిళలు బంగారు ఆభరణాలు ధరించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఒక వేళ ఆభరణాలు ధరిస్తే అవి కనబడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే మీ కాలనీల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కమలాపురం ఎస్ఐ 91211 00532, సీఐ 91211 00529 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు. అలాగే స్తోమత ఉన్న వారు మీ ఇళ్లల్లో లేదా ఐదారు మంది కలసి వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మీ వీధుల్లో ఎవైన సంఘటనలు జరిగితే సీసీ కెమెరాల ఫుటేజీ ఉపయోగపడు తుందన్నారు. అనంతరం ఆటోలో మండలంలోని అన్ని గ్రామాల్లో మైక్ అనౌన్స్‌మెంట్ చేసి దొంగతనాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

డీఎస్సీకి ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ఉచిత డీఎస్సీ కోచింగ్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

వల్లూరు (చెన్నూరు) : యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డీఎస్సీ ఉచిత కోచింగ్‌ను జిల్లాలోని డీఎస్సీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని విద్యాశాఖాధికారులు గంగిరెడ్డి, సునీతలు పిలుపునిచ్చారు. బుధవారం యూటీఎఫ్ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా ఆధ్వర్యంలో ప్రచురించిన ఉచిత డీఎస్సీ కోచింగ్ కరపత్రాలను వారు ఆవిష్కరించి మాట్లాడారు. విద్యారంగ పరిరక్షణ కోసం నిరంతరం పాటుపడుతున్న యూటీఎఫ్ బడుగు, బలహీనవర్గాల డీఎస్సీ అభ్యర్థులకు బాసటగా నిలుస్తూ కడపలోని యూటీఎఫ్ భవన్లో ఉచిత కోచింగ్ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని డీఎస్సీ అభ్యర్థులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు కె.నరసింహారావు (9440384701), జి.గోపీనాథ్ (9885125056)ను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కోచింగ్ అవగాహన సదస్సును ఏప్రిల్ 24వ తేదీ ఉదయం 9:30 గంటలకు కడప బాలాజీ నగర్‌లోని యూటీఎఫ్ భవన్లో నిర్వహిస్తున్నామని, ఈ సదస్సులో జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ షంషుద్దీన్ పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి వీరనారాయణ పాల్గొన్నారు.

వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు

పులివెందుల టౌన్ : టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి జహీర్ అహమ్మద్, వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు, షేక్ మాబాషా, షేక్ నజీర్‌బాషాలు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని స్థానిక వైఎస్ మనోహర్‌రెడ్డి స్వగృహ ఆవరణలో వారు విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులివెందులలో షాదీఖానా చంద్రబాబు ప్రభుత్వంలో వచ్చిందని చెప్పడం జరిగిందని, ఇది ఎంతవరకు సమంజసమో వారికే తెలియాలని, అసలు వాస్తవాలు మీకు తెలిసి మాట్లాడితే బాగుంటుందన్నారు. పులివెందులలో షాదీఖానా దివంగత వైఎస్సార్ హయాంలో ఏర్పాటు చేయడం జరిగిందని, అందుకు సంబంధించి షాదీఖానాను స్వయంగా ముఖ్యమంత్రి హోదాలో ఆయన ప్రారంభించారన్నారు. ఈద్గాకు సంబంధించిన 2.62 ఎకరాల భూమి యొక్క రిజిస్ట్రేషన్ హక్కుదారులకు, భూమిలో పోజిషన్ సర్టిఫికెట్ ఉన్నవారికి వైఎస్ కుటుంబ సభ్యులు పులివెందుల ముస్లింలకు ఈద్గా ఏర్పాటు కోసం డబ్బులు ఇవ్వడం జరిగిందని, అంతే గానీ రౌడీలకు, గుండాలకు, కబ్జాదారులు కాదన్నారు. ఒక వేళ అలా అనుకుంటే ఈద్గా పడగొట్టిన వారిపైన కఠిన చర్యలు ఎందుకు తీసుకోలేదని, అప్పుడు ఉన్నది టీడీపీ ప్రభుత్వం కాదా అని తెలియజేశారు. అలా కాకుండా ఏదో అవాస్తవాలు మాట్లాడడం ఎంతవరకు సబబు అని, పార్టీలో పదవి ఇచ్చారని దానిని అడ్డుపెట్టుకుని అబద్ధాలు మాట్లాడడం వారికి తగదని హితవు పలికారు.